సాక్షి
కర్నూలు
శుక్రవారం, 2, ఫిబ్రవరి, 2024



నాగిరెడ్డిపల్లెకు పార్వేట పల్లకీ

ఆళ్లగడ్డ: అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి పార్వేట పల్లకీ గురువారం నాగిరెడ్డిపల్లెకు చేరుకుంది. జ్వాలా నరసింహస్వామి, శ్రీ ప్రహ్లాద వరదస్వాములను గ్రామస్తులు దర్శించుకున్నారు.



.. కీళ్లకు సంకెళ్లు!

కీళ్లనొప్పితో బాధపడే వారి సంఖ్య ఇటీవల కాలంలో ఎక్కువైంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 2,40,000 మందికి పైగా ఆర్థరైటిస్‌తో బాధపడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. IIలో▸



సీఐలకు పదోన్నతి

పోలీసు శాఖ ఫోర్త్ జోన్ పరిధిలో 11 మంది సీఐలకు డీఎస్పీలుగా పదోన్నతి కల్పించి పోస్టింగులు ఇస్తూ ఏపీ డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. IIలో▸

న్యూస్‌రీల్

కర్నూలు దిశ పీఎస్ డీఎస్పీగా బాబు ప్రసాద్

- సుధాకర్‌రెడ్డి చిత్తూరుకు బదిలీ



బాబుప్రసాద్

కర్నూలు: దిశ పీఎస్ కర్నూలు డీఎస్పీగా జె.బాబుప్రసాద్ నియమితులయ్యారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జరిగిన బదిలీల్లో భాగంగా జిల్లా పోలీసు శాఖలో ముగ్గురు డీఎస్పీలకు స్థానచలనం కలిగింది. ఇందులో భాగంగా కర్నూలు దిశ పీఎస్ మహిళా డీఎస్పీగా ఉన్న ఐ.సుధాకర్ రెడ్డిని చిత్తూరు దిశ పీఎస్‌కు బదిలీ చేసి అక్కడున్న బాబు ప్రసాద్‌ను కర్నూలుకు బదిలీ చేస్తూ గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. అలాగే కర్నూలు ట్రాఫిక్ విభాగంలో అటాచ్ విధుల కింద పనిచేస్తున్న ఎం.నాగభూషణం ఏపీఎస్పీ 14వ బెటాలియన్‌కు, కర్నూలు ఎస్సీ, ఎస్టీ సెల్‌లో అటాచ్డ్ విధుల కింద పనిచేస్తున్న ఎం.యుగంధర్ బాబును సీఐఎస్ పశ్చిమ గోదావరి పీఎస్ డీఎస్పీగా బదిలీ చేశారు.

ముమ్మరంగా వైఎస్ఆర్ పెన్షన్ కానుక పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వైఎస్ఆర్ పెన్షన్ కానుక పంపిణీ గురువారం ఉదయం నుంచే మొదలైంది. తెల్లవారుజాము నుంచే గ్రామ, వార్డు వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేయడం విశేషం. సాయంత్రం 5 గంటల సమయానికి కర్నూలు జిల్లాలో 2,48,239 పింఛన్లు ఉండగా మొదటి రోజున 1,61535 మందికి(65.07 శాతం) నగదు పంపిణీ చేశారు. నంద్యాల జిల్లాలో 2,24,398 పింఛన్లు ఉండగా 1,42,581 మందికి(63.54 శాతం) నగదు అందజేశారు. ఉదయమే వచ్చి వరుసగా రెండవ నెల రూ.3వేల ప్రకారం పింఛను పంపిణీ చేయడంతో అవ్వాతాతల ముఖాల్లో సంతోషం వెల్లివిరిసింది. పింఛన్ల పంపిణీలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా డీఆర్‌డీఏ–వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ సలీమ్‌బాషా పర్యవేక్షించారు. నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరులో నంద్యాల జిల్లా డీఆర్‌డీఏ–వైకేపీ పీడీ శ్రీధర్‌రెడ్డి, ఉమ్మడి కర్నూలు జిల్లా డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ షరీఫ్ వికలాంగులు, ఇతరులకు పింఛన్లు వారి ఇంటి వద్దే పంపిణీ చేశారు. ఈ నెల 5వ తేదీ వరకు పింఛను పంపిణీ చేయనున్నారు.

సమ్మె విరమణ

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్సార్ క్రాంతి పథం (వైకేపీ) ఉద్యోగులు ఎట్టకేలకు సమ్మెను విరమించారు. వివిధ సమస్యలు, డిమాండ్‌లు పరిష్కరించాలని వీరు జనవరి 23 నుంచి సమ్మెలో ఉన్నారు. ఉద్యోగ సంఘాల నేతలతో సెర్ప్ ఉన్నతాధికారులు చర్చలు జరిపి సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో వైకేపీ ఉద్యోగులు గురువారం సమ్మెను విరమించి విధులకు హాజరయ్యారు.

20లోపు పరీక్ష ఫీజు చెల్లించాలి

కర్నూలు సిటీ: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్ష ఫీజు ఈ నెల 20వ తేదీలోపు చెల్లించాలని ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ జి.చంద్రభూషణ్ రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో గుర్తింపు పొందిన పరీక్ష కేంద్రాల్లో డ్రాయింగ్, హ్యాండ్‌లూమ్ వీవింగ్, టైలరింగ్ ఎంబ్రాయిడరీ విభాగాలలో లోయర్, హయ్యర్ గ్రేడ్‌లలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. డ్రాయింగ్ లోయర్‌కు రూ.100, హయ్యర్‌కు రూ.150,హ్యాండ్‌లూమ్ లోయర్‌కు రూ.150, హయ్యర్‌కు రూ.200, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్‌కు రూ.150, టైలరింగ్, ఎంబ్రాయిడరీ హయ్యర్‌కు రూ.200 ప్రకారం ఫీజు చెల్లించాలని తెలిపారు.అపరాధ రుసుం రూ.50తో ఈ నెల 29వ తేదీ వరకు, రూ.75 రుసుంతో వచ్చే నెల 3వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చునని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో www.bse. ap. gov. inలో చేసుకున్న దరఖాస్తులను వచ్చే నెల 6వ తేదీ సాయంత్రం 5గంటలలోపు అందజేయాలన్నారు.

- మహిళల ఆర్థికాభివృద్ధికి 'చేయూత' నిచ్చిన రాష్ట్ర ప్రభుత్వం
- వివిధ పథకాల కింద ఇప్పటి వరకు రూ.1,485 కోట్ల లబ్ధి
- 71 వేల మంది మహిళల జీవితాల్లో వెలుగులు
- 5న వైఎస్సార్ చేయూత నిధుల విడుదలకు రంగం సిద్ధం



గోనెగండ్ల మండలం పెద్దనెలటూరు గ్రామంలో పసుపు, కారం, పూర్ణం మిషన్లను నిర్వహిస్తున్న పొదుపు మహిళలు

ప్రభుత్వ ప్రోత్సాహం జీవనం.. సుసంపన్నం

కర్నూలు(అగ్రికల్చర్): రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక చర్యలతో మహిళల జీవన ప్రమాణాలు పెరిగాయి. ఒకప్పుడు పేదరికంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న వారు నేడు పారిశ్రామికవేత్తలుగా ఎదిగారు. వివిధ పథకాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఆర్థిక తోడ్పాటుతో పలు రకాల వృత్తుల్లో రాణిస్తూ కుటుంబానికి అండగా నిలిచారు. జిల్లాలో 34 వేల స్వయం సహాయ సంఘాల్లో 3.50 లక్షల మంది సభ్యులుగా ఉన్నారు. ప్రభుత్వం ప్రోత్సాహంతో వీరు జీవనోపాధులను అభివృద్ధి చేసుకున్నారు.

విస్తృతంగా పథకాలు

మహిళల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విస్తృతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. వైఎస్సార్ చేయూత, జగనన్న ఆసరా, జగనన్న తోడు, వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాల కింద మహిళలకు 2019–20 నుంచి ఇప్పటి వరకు రూ.1,485.67 కోట్లకుపైగా ఆర్థిక ప్రయోజనం లభించింది. అంతేకాకుండా వివిధ కార్యక్రమాల కింద అతివలకు ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటు ఇస్తోంది. బ్యాంకుల నుంచి ఉన్నతి, స్త్రీనిధి కింద రుణ సదుపాయం కల్పిస్తోంది. దీంతో మహిళలు ఒకరిపై ఆధారపడకుండా స్వశక్తితో రాణిస్తున్నారు.

ఆర్థిక స్వావలంబన

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకుంటూ మహిళలు పేదరికం నుంచి బయటికి వచ్చారు. జిల్లాలో రికార్డు స్థాయిలో 71,029 మంది మహిళలు జీవనోపాధులను అభివృద్ధి చేసుకున్నారు. వీరికి బ్యాంకులు, ఇతర సంస్థలు దాదాపు రూ.302.05 కోట్లు రుణాలుగా మంజూరు చేశాయి. వివిధ వృత్తుల ద్వారా మహిళలు అన్ని ఖర్చులు పోనూ నెలకు సగటున కనిష్ఠంగా రూ.10వేలు, గరిష్ఠంగా రూ.35 వేల వరకు నికరాదాయం పొందున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక తోడ్పాటుతో సాధారణ గృహిణిలుగా ఉన్న మహిళలు నేడు వ్యాపారులుగా విశేషంగా రాణిస్తున్నారు.

పారిశ్రామికవేత్తలుగా..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నుంచి అన్ని విధాలా ప్రోత్సాహం లభిస్తుండటంతో వందలాది మంది మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగారు. పొదుపు మహిళలు ఉత్పత్తి చేసిన వస్తువులు, తినుబండారాలను ప్రభుత్వం మార్కెటింగ్ సదుపాయం కూడా కల్పిస్తోంది. జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల, అమ్మకాల కేంద్రం ఏర్పాటైంది. ఇందులో పొదుపు మహిళలు ఉత్పత్తి చేసిన వాటిని అమ్ముకునే అవకాశం ఏర్పడింది. మహిళలు సంఘటితమై సొంత పెట్టుబడితో చేయూత మహిలా మార్ట్‌లు నడుపుతున్నారు. కోడుమూరులో నెలకొల్పిన మహిళా మార్ట్ రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచింది. జ్యూట్ బ్యాగ్‌ల, పేపర్ ప్లేట్స్, స్వీట్లు, తినుబండారాలు తయారు చేసి పలువురు మహిళలు షాపులకు సరఫరా చేస్తున్నారు. పసుపు, కారం పొడిమిషన్‌లు ఏర్పాటు చేసుకొని.. వాటిని ప్యాక్ చేసి మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నారు. ఉదీబత్తీలు, రొట్టెల తయారీ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. పొట్టేళ్ల, పెరటి కోళ్ల పెంపకంలో రాణిస్తున్నారు. విజిటబుల్ సోలార్ డ్రైయర్లను ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతున్నారు. జిల్లాలో మొత్తం 134 రకాల వృత్తుల్లో మహిళలు రాణిస్తున్నారు.



ఈ చిత్రంలోని మహిళ పేరు జి.నాగమణి. మండల కేంద్రమైన నందవరం గ్రామానికి చెందిన పొదుపు మహిళ. ప్రియాంక స్వయం సహాయక సంఘంలో సభ్యురాలుగా ఉన్నారు. ప్రభుత్వం నుంచి వివిధ రూపాల్లో ఆర్థిక తోడ్పాటు లభించడంతో మూడేళ్ల క్రితం దుస్తులు, గాజుల వ్యాపారం చేపట్టారు. ఈమెకు వైఎస్సార్ ఆసరా, వడ్డీ లేని రుణ సదుపాయం కూడా లభించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలతో జీవనోపాధి మెరుగుపడింది. పిల్లలను బాగా చదివించుకుంటున్నారు.



ఈ చిత్రంలోని మహిళ పేరు పర్వీన్. కల్లూరు మండలం సల్కాపురం గ్రామానికి చెందిన పొదుపు మహిళ. సరస్వతి స్వయం సహాయక సంఘంలో సభ్యురాలుగా ఉన్నారు. ఈ మహిళకు ప్రభుత్వం నుంచి వైఎస్సార్ ఆసరా, వడ్డీలేని రుణాలు లభించాయి. దీంతో స్వీట్స్ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకున్నారు. అన్ని రకాల స్వీట్లు తయారు చేసి కర్నూలుతో పాటు వివిధ ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. నెలకు అన్ని ఖర్చులు పోగా రూ.40 వేల నుంచి రూ. 50 వేల వరకు ఆదాయం వస్తోందని ఈమె తెలిపారు.

5న వైఎస్సార్ చేయూత

45 నుంచి 60 ఏళ్లలోపు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళల సంక్షేమం లక్ష్యంగా ప్రభుత్వం వైఎస్సార్ చేయూత కింద ఆర్థిక తోడ్పాటును అందిస్తోంది. మూడేళ్ల విజయవంతంగా చేయూత పథకాన్ని అమలు చేసిన ప్రభుత్వం 4వ ఏడాది నిధుల విడుదలకు రంగం సిద్ధం చేసింది. జిల్లాలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల మహిళలకు చేయూత కింద గడచిన మూడేళ్లలో రూ.666.50 కోట్ల ప్రయోజనం లభించింది. గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలకు రూ.478.49 కోట్లు, పట్టణ ప్రాంతాలకు చెందిన మహిళలకు రూ.188.01 కోట్ల ప్రకారం లబ్ధి చేకూరింది. నాలుగో ఏడాది వైఎస్సార్ చేయూత నిధులను ఫిబ్రవరి 5వ తేదీన విడుదల చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. వైఎస్సార్ చేయూత కింద 2023–24 ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ, పట్టణ ప్రాంత మహిళలు 1.50 లక్షల మందికి రూ.250 కోట్ల వరకు ఆర్థిక ప్రయోజనం లభించనుంది.

వైఎస్సార్‌సీపీ పాలనలో మహిళలకు ఇచ్చిన ఆర్థిక తోడ్పాటు

పథకం పేరు	అందిన ఆర్థిక సాయం (రూ.కోట్లలో)
వైఎస్సార్ ఆసరా	568.28
వైఎస్సార్ చేయూత	666.50
వైఎస్సార్ సున్నా వడ్డీ	140.66
జగనన్న తోడు	110.23
మొత్తం	1,485.67

జీవనోపాధులు అభివృద్ధి చేసుకున్న మహిళల సంఖ్య

జీవనోపాధి పేరు	రాణిస్తున్న మహిళలు
రిటైల్ వ్యాపారం	4,918
వస్త్ర వ్యాపారం	1,802
డెయిరీ	8,974
గొర్రెలు, మేకల పెంపకం	19,502
పెరటి కోళ్ల పెంపకం	1,807
ఆహార ఉత్పత్తులు	738
వ్యవసాయ ఉత్పత్తులు	26,229
ఇతర వృత్తుల్లో రాణిస్తున్నవారు	7,059
మొత్తం	71,029

మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట



మహిళా సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. వివిధ పథకాలు అమలు చేస్తూ వారికి ఆర్థిక ప్రయోజనం కలిస్తోంది. గతంలో మాదిరి కాకుండా బ్యాంకులు కూడా ఉదారంగా రుణాలు ఇస్తున్నాయి. దీంతో మహిళలు వివిధ వ్యాపారాలు, వృత్తుల్లో విశేషంగా రాణిస్తున్నారు. జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కౌంటర్‌కు విశేష స్పందన వస్తోంది. ఇందులో పొదుపు మహిళలు తయారు చేసిన వాటినే అమ్మకానికి పెడుతున్నాం.

– సలీమ్‌బాషా, డీఆర్‌డీఏ–వైకేపీ పీడీ

నిరాశ పరిచిన నిర్మలమ్మ పద్దు

- వేతన జీవులకు లభించని ఊరట.. పాత స్లాబులే కొనసాగింపు
- బడ్జెట్‌లో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ఊసే కరువు
- జిల్లాకు ప్రత్యేక కేటాయింపులు లేకపోవడంపై పెదవి విరుపు



కర్నూలు(సెంట్రల్): కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మూడు నెలల కాలానికి గురువారం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ జిల్లా ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేసింది. బడ్జెట్‌లో జిల్లాకు సంబంధించిన పలు ప్రతిపాదనలకు నిధులు కేటాయించలేదు. విభజన చట్టం 2014 ప్రకారం వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి సంబంధించి కర్నూలు జిల్లాకు ప్రత్యేకంగా నిధులు వస్తాయని భావించారు. అయితే అలాంటి కేటాయింపులేమీ జరగలేదు. వ్యవసాయంలో పెట్టుబడి వ్యయం పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆసరా ఇస్తుందని జిల్లాలోని 6 లక్షల మంది అన్నదాతలు భావించారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధిని రూ.6 వేల నుంచి రూ. 9 వేలకు పెంచుతారని ఆశించారు. అలాంటి పెంపు ప్రతిపాదనేమీ చేయలేదు. అలాగే అతివృష్టి, అనావృష్టులతో పంటలు దెబ్బతింటే ఆదుకునేందుకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ఉన్నదని చెప్పారు. అయితే ఇందులో రైతులు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. దీనిని రద్దు చేస్తారని భావించినా ప్రస్తావన లేకపోవడం గమనార్హం. గిట్టుబాటు ధరల ప్రస్తాన లేకపోవడం పై అన్నదాతలకు ఎలాంటి మేలు చేకూరే బడ్జెట్ ఇది కాదని నిపుణులు అంచనా వేస్తున్నారు. బడ్జెట్‌లో వేతన జీవులకు ఊరట లభించలేదు. పాత పన్ను స్లాబులే కొనసాగిస్తామని మంత్రి ప్రకటించారు. కాగా.. సోలార్ రూఫ్ టాప్‌లకు 30 నుంచి 70 శాతం వరకు సబ్సిడీ ఇస్తామని చెప్పడం.. ఎలక్ట్రానిక్ వాహనాల కోసం ఈవీ స్టేషన్లను ఏర్పాటు చేస్తామనడం.. ఎంఎస్ఎంఈ ప్రాజెక్టులకు రెండు లక్షల కోట్లకుపైగా రుణాలు ఇచ్చేందుకు నిర్ణయించడం బడ్జెట్‌లో కాస్త ఊరటనిచ్చే అంశాలు.

ఉద్యోగులను పట్టించుకోలేదు

వేతనజీవులు ఆదాయ పన్నుల స్లాబులు కొంత ఊరటను కలిగిస్తాయి. ఈ బడ్జెట్‌లో ఉద్యోగులను పట్టించుకోలేదు. ద్రవ్యలోటు జీడీపీలో 5.8 శాతం ఉండడం ఆందోళనకరం. ప్రజల వ్యయం 11 శాతం పెరిగిందని చెప్పడం కూడా ఆందోళనకరమే. నిర్మలా సీతారామన్ అంకెల గారడీతో మోసగించారు. – ప్రొఫెసర్ మన్సూర్ రహమాన్, ఆర్థిక వేత్త, కర్నూలు

ప్రత్యేక నిధులు లేవు

వెనుకబడిన జిల్లాలకు బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు లేవు. బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం జరిగింది. ఏపీ పేరు లేకుండానే కేంద్ర బడ్జెట్‌ను చదవడం విచారకరం. జిల్లాకు సంబంధించి యువతకు ఉపాధిని కల్పించే రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, మంత్రాలయం –కర్నూలు లైన్ ఊసే లేదు.

– బీవై రామయ్య, మేయర్, వైఎస్ఆర్‌సీపీ కర్నూలు పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు

సవరణ కోరాలి

కేంద్ర బడ్జెట్ తీవ్ర నిరాశ పరిచింది. కర్నూలు జిల్లాకు ఎలాంటి ప్రయోజనాలు రాలేదు. సాగునీటి పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు లేవు. జిల్లా ఎంపీలు సవరణ కోసం పట్టుబట్టాలి.

– బి.గిడ్డయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి

పేదలకు ప్రయోజనం లేదు

బీజేపీ ప్రయోజనాలకు అనువైన బడ్జెట్ ఇది. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రలకు మొండి చేయి చూపించారు. పేదవారికి ఏ మాత్రం ఈ బడ్జెట్‌లో ఉపయోగకరమైన అంశాలు లేవు.

– డి.గౌస్‌దేశాయ్, సీపీఎం జిల్లా కార్యదర్శి, కర్నూలు

ఏడు అంశాలకు ప్రాధాన్యం

మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మరో అద్భుతమైన బడ్జెట్ ఇది. ఏడు ప్రాధాన్య అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. ఇది ఎలక్షన్ బడ్జెట్ కాదు. ఈ బడ్జెట్ అమలుతో వ్యవసాయం ఉన్నతమైన ప్రగతిని సాధిస్తుంది. వంద సంవత్సరాలకు సంబంధించిన బడ్జెట్ ఇది.

– హరీష్‌బాబు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కర్నూలు

సార్వత్రిక ఎన్నికలకు సిద్ధంకండి



సమావేశంలో మాట్లాడుతున్న డీజీపీ రాజేంద్రనాథరెడ్డి, హాజరైన డీఐజీ సెంథిల్‌కుమార్, ఎస్పీలు కృష్ణకాంత్, రఘువీర్‌రెడ్డి తదితరులు

- డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి

బొమ్మలసత్రం: రాబోయే సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం కావాలని రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి ఆయా జిల్లాల పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో అనంతపురం, కర్నూలు డీఐజీలు అమ్మిరెడ్డి, సెంథిల్ కుమార్, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి, వైఎస్సార్ జిల్లాల ఎస్పీలు తదితర అధికారులతో వచ్చే ఎన్నికల నేపథ్యంలో ముందస్తు తీసుకోవాల్సిన బందోబస్తు చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సదర్భంగా డీజీపీ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో నిష్పక్షపాతంగా చట్ట పరిధిలో పని చేయాలని సూచించారు. ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ఆయా జిల్లాలలో సమస్యాత్మక ప్రాంతాలు, సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గుర్తించి ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఎన్నికల సమయం కంటే ముందే బందోబస్తు ఏర్పాటు పరిశీలించుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సమావేశంలో నంద్యాల జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి, కర్నూలు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, వైఎస్సార్ జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్, అనంతపురం జిల్లా ఎస్పీ అన్బురాజన్, సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్.వి మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యథాతథంగా మున్సిపల్ అధికారులు

- బదిలీల్లో మార్పు

కర్నూలు (టౌన్): రెండు రోజుల క్రితం నగరపాలక సంస్థలో జరిగిన బదిలీల్లో మార్పు చోటు చేసుకుంది. మున్సిపల్ అధికారులను యథాస్థానాల్లో కొనసాగిస్తూ గురువారం రాత్రి మున్సిపల్ పరిపాలన శాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీలక్ష్మి జీవో 126 జారీ చేశారు. దీంతో గుంటూరుకు బదిలీ అయిన అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, అలాగే వినుకొండ మున్సిపాల్టీకి కమిషనర్‌గా బదిలీ అయిన నగరపాలక డిప్యూటీ కమిషనర్ ఎస్.వి.శివారెడ్డి, గూడూరు కమిషనర్‌గా బదిలీ అయిన ప్రసాద్‌గౌడ్‌ను యథాస్థానాల్లోనే కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

తంచన్‌గా పింఛన్

కదల్లేని వృద్ధులు.. మంచానికే పరిమితమైన దివ్యాంగులు.. అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు.. తంచన్‌గా ఒకటో తేదీనే పింఛన్ అందుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లకుండా, అధికారులను ప్రాధేయపడకుండా.. ఇంటి వద్దనే పింఛన్ తీసుకున్నారు. గుడ్ మార్నింగ్ చెబుతూ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పింఛన్లు పంపిణీ చేశారు.

– సాక్షినెట్‌వర్క్



తుగ్గలి మండలం మామిళ్లకుంటలో సుంకమ్మకు పింఛన్ అందించేందుకు ఫేస్ అథెంటికేషన్ చేస్తున్న వలంటీర్ భీమేష్



కొలిమిగుండ్ల మండలం అంకిరెడ్డిపల్లెలో తెల్లవారు జామున 5 గంటలకే రంగమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ దేవి



డోన్ పట్టణంలో దివ్యాంగురాలికి పింఛన్ అందించేందుకు ఆర్‌బీఐఎస్ తీసుకుంటున్న వెల్ఫేర్ అసిస్టెంట్ ఆలా రమేష్



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నందికొట్కూరు మండలం అల్లూరు గ్రామానికి చెందిన గుజ్జల చెన్నయ్యకు పింఛన్ ఇస్తున్న వలంటీర్ శ్రీనివాసులు



ఆస్పరి మండలం శంకరబండ గ్రామంలో వృద్ధురాలు లక్ష్మమ్మకు పింఛన్ ఇస్తున్న వలంటీర్ వెంకటేష్

నడి వయస్సులో కీళ్లకు సంకెళ్లు!

- వేధిస్తున్న రుమటాయిడ్ సమస్యలు
- మారిన ఆహారపు అలవాట్లే కారణం
- ఐదు శాతం ప్రజల్లో రుగ్మత
- నేడు రుమటాయిడ్ ఆర్థరైటిస్ అవగాహన దినం

ఉదయాన్నే నిలబడలేరు.. కూర్చోలేరు.. నాలుగు అడుగులు సరిగ్గా వేయ నూలేరు.. కీళ్లు పట్టేసి చాలా ఇబ్బందులు ఎదుర్కొంటూ ఉంటారు. ఇలాంటి సమస్యతో బాధపడే వారి సంఖ్య ఇటీవల కాలంలోఎక్కువైంది. మారిన ఆహారపు అలవాట్లు, జీవనశైలి కారణంగానే ఈ సమస్యలు వచ్చిపడుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఈ నెల 2వ తేదీన రుమటాయిడ్ ఆర్థరైటిస్(కీళ్లవాతం) అవగాహన దినం సందర్భంగా ప్రత్యేక కథనం.



కర్నూలు(హాస్పిటల్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో 40 లక్షలకు పైగా జనాభా ఉండగా.. ఐదు శాతం మంది అంటే దాదాపు 2,40,000 మందికి పైగా ఆర్థరైటిస్‌తో బాధపడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. బాధితుల్లో ఎక్కువగా నడి వయస్సు వారు ఉన్నారు. మొదట్లో దీని బారిన పడే వారు అధికంగా పట్టణాల్లో మాత్రమే ఉండేవారు. ఇప్పుడు పట్టణాలు, గ్రామాలు అన్న తేడా లేకుండా ఈ వ్యాధి పీడిస్తోంది. ఈ జబ్బులో తేలు కుట్టిన విధంగా నొప్పి ఉంటుంది. దీంతో పాటు కీళ్లు పట్టినట్లు ఉండటం, కీళ్లు చాచడం, మడవడం కష్టంగా ఉంటుంది. కీళ్లచుట్టూ ఉన్న ఎముకలు, కండరాలు, టెన్డాన్లను, లింగమెంట్లను ఏకకాలంలో ప్రభావం చూపిస్తూ ఆ ప్రదేశాల్లో భరించలేని నొప్పి వస్తుంది.

వ్యాధి రావడానికి కారణాలు ఇవే..

సాధారణంగా మనం తీసుకున్న ఆహారం జీర్ణం అయిన తర్వాతే మళ్లీ భుజించాలి. కానీ అది జీర్ణం కాకముందే మళ్లీ మళ్లీ ఆహారం తీసుకోవడం, సమయానికి ఆహారాన్ని తీసుకోకపోవడం వల్ల జీర్ణ వ్యవస్థ దెబ్బతింటుంది. తిన్న ఆహారం కూడా సరిగ్గా జీర్ణం కాకపోవడంతోఅది విషం(ఆమం)గా మారి శరీరంలో ప్రసరించి వాతాన్ని కలిగిస్తుంది. అది ప్రకోపించి అన్ని కీళ్లలో చేరి అక్కడ నొప్పి, వాపును కలుగజేస్తుంది. దీనిని ఆటో ఇమ్యూన్ డిజార్డర్‌గా పిలుస్తారు. దీంతో మన శరీరంలోని రక్షణ వ్యవస్థ మనలను రక్షించడానికి బదులు శరీరంలోని కణజాలాలు, కీళ్లపై దాడి చేసి అక్కడ నొప్పి, వాపును కలుగజేస్తుంది. దీంతో పాటు అంటువ్యాధులు, హార్మోన్ల మార్పులు, మానసిక ఒత్తిళ్లు, ధూమపానం, కాలుష్యకారకాల వల్ల కూడా కీళ్లవాతం వచ్చేందుకు అవకాశాలు ఉన్నాయి.

వ్యాధి నివారణ మార్గాలు

- మసాల ఆహారానికి, కూల్‌డ్రింక్స్‌కు దూరంగా ఉండాలి.
- మాంసాహారం, నిల్వ ఉంచిన పదార్థాలు తినకపోవడం మంచిది.
- మినుములతో చేసిన పదార్థాలు, జంక్‌ఫుడ్స్‌ను దరిచేరనీయవద్దు.
- చల్లని వాతావరణంలో జాగ్రత్తలు తీసుకోవాలి.
- రాత్రిపూట ఎక్కువ సేపు మేల్కొకుండా ఉండాలి.

ఆధునిక మందులతో అదుపులో కీళ్లవాతం



కీళ్లవాతం(రుమటాయిడ్ ఆర్థరైటిస్) వ్యాధికి పాతకాలం చికిత్సలో భాగంగా డిసీజ్ మాడిఫైడ్ యాంటి రుమాటిక్ డ్రగ్స్‌ను వాడతాం. ఇందులో వ్యాధినిరోధక శక్తి పెంచి కీళ్లవాతం నియంత్రణలో ఉంటుంది. ఇప్పుడు కొత్తగా బైలాజిక్ డ్రగ్స్ వచ్చాయి. ఇందులో రోగికి నొప్పి ఉన్న చోట ఇంజెక్షన్ ఇస్తాం. దీనివల్ల సైడ్‌ఎఫెక్ట్స్ తక్కువ. అయితే ఈ మందులు ఖరీదైనవి. కీళ్లవాతంలో ఇచ్చేమందులు నేరుగా ఇమ్యూన్ సిస్టమ్‌పై పనిచేస్తాయి కాబట్టి కొన్నిసార్లు ఇన్‌ఫెక్షన్ రిస్క్ ఉంటుంది. ట్రీట్ టు టార్గెట్ విధానంలోనూ ఆధునిక పద్ధతిలో మందులున్నాయి. వ్యాధిని త్వరగా గుర్తించి త్వరగా చికిత్స తీసుకుంటే వ్యాధి నియంత్రణలో ఉంటుంది.

–డాక్టర్ శ్రీహరిరెడ్డి, కీళ్లవాతవ్యాధి నిపుణులు, కర్నూలు

రెగ్యులర్‌గా మందులు వాడితే నియంత్రణ



రుమటాయిడ్ ఆర్థరైటిస్‌ను ముందుగా గుర్తించి వైద్యుల సూచన మేరకు రెగ్యులర్‌గా మందులు వాడితే దానిని అదుపులో ఉంచుకోవచ్చు. అలా గాకుండా మందులు సరిగ్గా వాడకపోతే ఇతర అవయవాలకు నష్టం కలిగే అవకాశం ఉంది. సాధారణంగా పురుషుల కంటే స్త్రీలలో ఈ వ్యాధి కాస్త ఎక్కువ. దాంతో పాటు ఏ వయస్సు వారికైనా ఈ వ్యాధి రావచ్చు. ఈ మందులు వ్యాధినిరోధకశక్తిపై ప్రభావం చూపిస్తాయి కాబట్టి కొందరిలో దుష్ప్రభావాలు రావచ్చు . వైద్యుల సూచనల మేరకు మందులు వాడితే ఏమీ కాదు. మందులతో పాటు మంచి ఆరోగ్య జీవనవిధానం అలవరచుకోవాలి. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి. మానసిక ఒత్తిడిని తగ్గించుకుని, అధిక బరువును తగ్గించుకోవాలి.

–డాక్టర్ స్నజన, రుమటాలజిస్టు, కర్నూలు

ఆహార పద్ధతులు మార్చుకోవాలి



కీళ్లవాతాన్ని స్వేదకర్మ, లంఖనం(ఉపవాసం), పాచనౌషధములు, రూక్షకరమైన ఆలేపణము, రూక్ష స్వేదము(సన్నటి ఇసుకను కొద్దిగా వేడి చేసి నొప్పి ఉన్న చోట కాపడం పెట్టడం), సేకము మొదలైన చికిత్సా పద్ధతుల ద్వారా నివారించవచ్చు. బాధితులు చల్లటి నీటితో స్నానం చేయరాదు. గోరువెచ్చని నీటిని తాగాలి. ముందుగా తీసుకున్న ఆహారం జీర్ణం అయిన తర్వాతే మళ్లీ భుజించాలి. ఫ్రిడ్జ్‌లో ఉన్న ఆహారాన్ని తినకూడదు. ఆయుర్వేద మందులతో ఈ వ్యాధిని నియంత్రణలోకి తీసుకురావచ్చు. పంచకర్మ, శమన, ఔషధ చికిత్సల ద్వారా మంచి ఫలితం కనిపిస్తుంది.

–డాక్టర్ ద్వారం ప్రభాకర్‌రెడ్డి, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యులు, కర్నూలు

క్లుప్తంగా

యువతకు మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న మేయర్ బీవై రామయ్య. చిత్రంలో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు సిటీ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయని కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కాలేజీలో ఉద్యోగ మేళా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మేయర్, ఎమ్మెల్యే ప్రసంగించారు. ఉద్యోగాలు పొందేలా డిగ్రీ కోర్సుల్లో రాష్ట్ర ప్రభుత్వం మార్పులు చేసిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో తీసుకొచ్చిన మార్పులను చూసి వివిధ రాష్ట్రాలకు చెందిన అభినందనలు చెబుతున్నారన్నారు. జాబ్ మేళాలో సుమారుగా 1,500 మంది నిరుద్యోగులు పాల్గొనగా, ఆయా కంపెనీలు వారికి కావాల్సిన విద్యార్హతలు కలిగిన వారిని ఎంపిక చేసుకున్నారు. ఈ మేళాలో జిల్లా ఉపాధి కల్పన అధికారి దీప్తి, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

మందుబాబులకు జైలు

కర్నూలు: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఆరుగురు మద్యం బాబులకు రెండు రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి వెంకటరామిరెడ్డి తీర్పు చెప్పారు. ట్రాఫిక్ పోలీసులు బుధవారం రాత్రి సుంకేసుల రోడ్డులో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. తెలంగాణలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ కర్నూలుకు వస్తుండగా ట్రాఫిక్ పోలీసులు తనిఖీ చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకుని గురువారం ఉదయం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వెంకటరామిరెడ్డి ఎదుట హాజరుపర్చగా రెండు రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు వారిని కర్నూలు మండలం పంచలింగాల శివారులో ఉన్న జిల్లా జైలులో అప్పగించారు.

డీఐజీ సెంథిల్ కుమార్‌కు ఘన సన్మానం



డీఐజీని సన్మానిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి తదితరులు

బొమ్మలసత్రం: బదిలీ అయిన కర్నూల్ రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్‌ను నంద్యాల జిల్లా పోలీసులు ఘనంగా సన్మానించారు. స్థానిక ఇంద్రప్రస్థ హోటల్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి ఆధ్వర్యంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూల్ రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్ మాట్లాడుతూ నంద్యాల జిల్లా ఆవిర్భావం నుంచి క్రైమ్ రేట్ తగ్గితంచడంలో పోలీసు యంత్రాంగం సమిష్టి కృషి చేసిందన్నారు. విధి నిర్వహణలో చట్టపరంగా నిష్పక్షపాతంగా పని చేయాలన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ప్యాపిలి: గుడిపాడు గ్రామంలో ఓ యువకుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. గ్రామానికి చెందిన చిన్నమద్దయ్య, రమాదేవి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు మదన్‌మోహన్ (28) గ్రామపంచాయతీ బోరు మరమ్మతు పనులు చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బోరు మరమ్మతు సమయంలో పైపులు కరెంట్ తీగలకు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో యవకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

అర్హులు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కర్నూలు జిల్లా కలెక్టర్ సృజన

కర్నూలు(సెంట్రల్): అర్హులు ఎవరైనా ఉంటే ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ డాక్టర్ జి.సృజన సూచించారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమీక్షించారు. తుది ఓటరు జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తనకు గాని, నియోజకవర్గాల ఆర్‌ఓలకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. వాటిపై తగిన విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికలు జరగబోయే సంవత్సరంలో తుది ఓటరు జాబితా ప్రచురణ అయిన తరువాత సుమోటో డిలిషన్స్(తొలగింపులు) చేయరాదన్నారు. తుది ఓటరు జాబితా ప్రచురణలో ఎలాంటి డిలిషన్స్ చేయాలన్నా జిల్లా ఎన్నికల అధికారి/జిల్లా కలెక్టర్ అనుమతి తప్పనిసరిగా ఉండాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు పోలింగ్ కేంద్రాలను సందర్శించి మౌలిక వసతులను పరిశీలించాలన్నారు. ఎక్కడైనా ఏర్పాట్లు సరిగా లేకపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈవీఎం, వీవీ ప్యాట్ల వినియోగంపై ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నామని, ఇందులో రాజకీయ పార్టీలు కూడా తమ భాగస్వామ్యం ఉండేలా చూడాలని ఆమె కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ నుంచి అరుణ్‌కుమార్, బీజేపీ నుంచి సాయిప్రదీప్, టీడీపీ నుంచి ఎల్వీ ప్రసాదు, వైఎస్ఆర్‌సీపీ నుంచి కర్నాటి పుల్లారెడ్డి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళీ పాల్గొన్నారు.

వర్సిటీ నాన్‌టీచింగ్ ఉద్యోగుల్లో ఆనందం



సీఎం ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న మేయర్ రామయ్య తదితరులు

- 'థ్యాంక్యూ సీఎం సర్' అంటూ సంబరాలు
- ఆర్‌యూ వద్ద ముఖ్యమంత్రి జగన్ ఫ్లెక్సీకి పాలాభిషేకం

కర్నూలు కల్చరల్: రాష్ట్రంలోని వర్సిటీల్లో విధులు నిర్వహిస్తున్న నాన్ టీచింగ్ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచడంతో ఉద్యోగులు ఆనందరంతో సంబరాలు జరుపుకున్నారు. గురువారం కర్నూలు రాయలసీమ విశ్వవిద్యాలయం వద్ద వర్సిటీ నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్లెక్సీకి కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, కోడుమూరు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆదిమూలపు సతీష్, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు ప్రశాంత్, వర్సిటీ ఉద్యోగులు పాలాభిషేకం చేశారు. థ్యాంక్యూ సీఎం సర్ అంటూ నినాదాలు చేస్తూ టపాసులు పేల్చి మిఠాయిలు తినిపించుకొని సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. సీఎం జగన్ ప్రజా సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు ఉద్యోగులకు అండగా నిలుస్తున్నారన్నారు. ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ.. విద్య, వైద్య రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సురేంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలోని వర్సిటీ నాన్ టీచింగ్ ఉద్యోగుల పదవీ విరమణ వయసు రెండేళ్లు పెంచడం శుభపరిణామన్నారు. రాష్ట్రంలోని 18 యూనివర్సిటీల్లో సుమారు 11,500 మందికి కల నెరవేరిందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మాలిక్, శ్యామల, తులసమ్మ, సుధాకర్, రమేష్, భాస్కర్ వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో ఇంటర్ ప్రాక్టికల్ మార్కులు

కర్నూలు సిటీ: ఇంటర్ ప్రాక్టికల్ పరీక్ష ముగిసిన రోజే ఆన్‌లైన్‌లో మార్కులు నమోదు చేయాల్సి ఉంటుందని ఇంటర్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి గురవయ్య శెట్టి, జిల్లా వృత్తి విద్యాధికారి జమీర్ పాషా తెలిపారు. గురువారం స్థానిక టౌన్‌మోడల్ జూనియర్ కాలేజీలో ప్రాక్టికల్ పరీక్షలపై సైన్స్ లెక్చరర్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు అవగహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేడు (శుక్రవారం), రేపు (శనివారం) పర్యావరణ విద్య, నైతిక మానవ విలువ పరీక్షలు, ఈ నెల 5వ తేదీ నుంచి వొకేషనల్, 11వ తేదీ నుంచి జనరల్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయన్నారు. పర్యావరణ విద్య, నైతికత, మానవ విలువల పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని, ఈ పరీక్షలకు సంబంధించి ప్రశ్నపత్రం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారని, ఆయా కాలేజీలకు లింక్‌ను పంపిస్తామన్నారు. ఎక్కడ ఎలాంటి తప్పులకు తావు లేకుండా పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించి ఆన్‌లైన్‌లో నమోదు చేసే మార్కులు బయటికి తెలియకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు పరమేశ్వరరెడ్డి, జి.లాలెప్ప, సి.ప్రభు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్ఐఓ గురవయ్య శెట్టి

ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



కొండారెడ్డి బురుజు వద్ద మోటార్ సైకిల్ ర్యాలీ ప్రారంభిస్తున్న ఏఎస్పీ నాగరాజు

కర్నూలు: వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని అడ్మిన్ అడిషనల్ ఎస్పీ నాగరాజు అన్నారు. 35వ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని గురువారం రవాణా, పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలో మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కొండారెడ్డిబురుజు వద్ద అడిషనల్ ఎస్పీ నాగరాజు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించగా రాజ్‌విహార్, కలెక్టరేట్, సి.క్యాంప్ సెంటర్ మీదుగా నంద్యాల చెక్‌పోస్టు వరకు ర్యాలీ సాగింది. అంతకుముందు డీటీసీ శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగిన ప్రారంభ సమావేశంలో అడిషనల్ ఎస్పీ నాగరాజు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్టు ధరించాలన్నారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వకూడదని సూచించారు. డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడపరాదని, రోడ్డు నియమాలు పాటించి వాహనాలు నడిపితే సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకుంటారన్నారు. ఆర్‌టీఓ రమేష్, ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం, సీఐలు రమణ, గౌతమి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, ఆర్‌టీఏ కార్యాలయ పరిపాలనాధికారి వెంకటకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు శాఖలో కొనసాగుతున్న బదిలీలు

- 16 మంది సీఐలు, 65 మంది ఎస్ఐలకు స్థానచలనం



కర్నూలు: పోలీసు శాఖలో అధికారుల బదిలీ, పోస్టింగ్‌ల ప్రక్రియ కొనసాగుతోంది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలీసు శాఖ ఉన్నతాధికారులు విడతల వారీగా పోలీసు అధికారులకు స్థానచలనం కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా కర్నూలు రేంజ్ పరిధిలో వీఆర్‌లో ఉన్న పలువురిని పొరుగు జిల్లాలకు బదిలీ చేస్తూ డీఐజీ సెంథిల్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే వీఆర్‌లో ఉన్న పలువురు ఎస్ఐలను స్టేషన్లకు కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి, కడప, అన్నమయ్య జిల్లాల్లో పనిచేస్తున్న 65 మంది ఎస్ఐలకు కూడా స్థానచలనం కలిగింది.

బదిలీ అయిన సీఐల జాబితా...

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఎం.ఉపేంద్రబాబు	వీఆర్, కర్నూలు రేంజ్	అనంతపురం రేంజ్
ఆదిలక్ష్మమ్మ	వీఆర్, కర్నూలు రేంజ్	వీఆర్, కర్నూలు
యు.లక్ష్మయ్య	వీఆర్, కర్నూలు రేంజ్	అనంతపురం రేంజ్
శ్రీనివాస నాయక్	కర్నూలు రేంజ్	సీసీఎస్–1, కడప
కె.శ్రీరాం	కర్నూలు రేంజ్	అనంతపురం రేంజ్
ఎం.నాగశేఖర్	కర్నూలు రేంజ్	వీఆర్,అన్నమయ్య జిల్లా
ఎం.సోనక్క	కర్నూలు రేంజ్	అనంతపురం రేంజ్
శివాంజనేయులు	వీఆర్, కర్నూలు రేంజ్	అనంతపురం రేంజ్
పి.సురేష్ కుమార్	వీఆర్, కర్నూలు రేంజ్	సీసీఎస్, నంద్యాల
ఆర్.రామకృష్ణ	వీఆర్, కర్నూలు రేంజ్	అనంతపురం రేంజ్
ఆర్.అర్జున్ నాయక్	వీఆర్, కర్నూలు రేంజ్	అనంతపురం రేంజ్
ఎం.సుదర్శన్ ప్రసాద్	వీఆర్, కడప	అనంతపురం రేంజ్
ఎస్.మురళీకృష్ణ	వీఆర్, అన్నమయ్య	అనంతపురం రేంజ్
కంబగిరి రాముడు	వీఆర్, కర్నూలు రేంజ్	ఎస్సీ,ఎస్టీ సెల్,నంద్యాల
కళా వెంకటరమణ	కర్నూలు రేంజ్	అనంతపురం రేంజ్
బి.మల్లికార్జున గుప్త	పీసీఆర్, నంద్యాల	వీఆర్,అన్నమయ్య జిల్లా

11 మంది సీఐలకు డీఎస్పీలుగా పదోన్నతి

కర్నూలు: పోలీసు శాఖ ఫోర్త్ జోన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న 11 మంది సీఐలకు డీఎస్పీలుగా పదోన్నతి కల్పించి పోస్టింగులు ఇస్తూ ఏపీ డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు రేంజ్ పరిధిలో నలుగురు, కర్నూలు రేంజ్ పరిధిలో 11 మంది కలిపి మొత్తం 15 మంది సీఐలకు డీఎస్పీలుగా పదోన్నతి కల్పిస్తూ డీజీపీ ఉత్తర్వులు ఇచ్చారు. ఇందులో 1991 బ్యాచ్‌కు చెందినవారు ఒకరు కాగా, మిగిలిన వారు 1995 బ్యాచ్‌కు చెందినవారు.

డీఎస్పీలుగా పదోన్నతి పొందిన వారి జాబితా

పేరు	ప్రస్తుత స్థానం	పదోన్నతిపై పోస్టింగ్ ఇచ్చిన స్థానం
ఎం.ఉపేంద్ర బాబు	సీసీఎస్, కర్నూలు	దిశ పీఎస్ డీఎస్పీ, అనకాపల్లి
బి.నాగరాజు	పీటీసీ, అనంతపురం	డీఎస్పీ, సీఐడీ
డి.రామకృష్ణుడు	-	డీఎస్పీ, ఇంటెలిజెన్స్
ఎస్.డి.తేజేశ్వర రావు	ఏసీబీ, కర్నూలు	ఎస్‌బీ, చిత్తూరు డీఎస్పీ
టి.సాయినాథ్	పీటీసీ, అనంతపురం	దిశ పీఎస్ డీఎస్పీ, నెల్లూరు
పి.రామకృష్ణాచారి	చిత్తూరు ఎస్‌బీ	ఈఓడబ్ల్యూ-2, సీఐడీ (సిట్, మంగళగిరి)
ఆర్.వి.రమణరావు	ఇంటెలిజెన్స్	డీఎస్పీ, ఇంటెలిజెన్స్
కె.నరసింహమూర్తి	తిరుపతి పీటీసీ	ఎస్‌డీపీఓ, నగరి
డి.వి.జి.వేణుగోపాల్	సీసీఎస్, తిరుపతి	డీఎస్పీ, సీఐడీ
దేగల ప్రభాకర్	సీఐడీ, కర్నూలు	డీఎస్పీ, సిట్, మంగళగిరి
ఎస్.రవీంద్రనాథ్ రెడ్డి	పుట్టపర్తి ఎస్‌బీ	ఎస్‌డీపీఓ, నంద్యాల

గ్రానైట్ అక్రమంగా తరలిస్తున్న రెండు లారీలు సీజ్

కర్నూలు (న్యూటౌన్): చిత్తూరు నుంచి హైదరాబాద్‌కు, ఒంగోలు నుంచి హైదరాబాద్‌కు గ్రానైట్ స్లాబ్స్‌ను అక్రమంగా తరలిస్తున్న రెండు లారీలను సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు ఓర్వకల్లు మండలం నన్నూరు టోల్‌ప్లాజా వద్ద బుధవారం అర్ధ రాత్రి ఆకస్మికంగా దాడులు చేసి రెండు లారీలను పట్టుకున్నట్లు చెప్పారు. సీజ్ చేసిన రెండు లారీలను కర్నూలు ఆర్టీసీ బస్సు డిపోలో ఉంచామన్నారు. దాడుల్లో జిల్లా మైనింగ్ విజిలెన్స్ ఏడీ బైరాగినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనపై దృష్టి

కర్నూలు(సెంట్రల్): పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. గురువారం సాయంత్రం ఆయన విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. మార్చిలో జరిగే ఇంటర్, పదో తరగతి పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లను చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 9న జరిగే డీవార్మింగ్ డే(నులిపురుగుల నివారణ)ను పురస్కరించుకొని అంగన్‌వాడీలు, పాఠశాలలు, కాలేజీల్లో విద్యార్థులకు అల్బెండజోల్ మందులు సరఫరా చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌కు క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, కలెక్టరేట్ నుంచి జేసీ నారపురెడ్డి మౌర్య పాల్గొన్నారు.

హోరాహోరీగా ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు



కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

కర్నూలు (టౌన్): నగరంలోని స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్ డోర్ స్టేడియంలో గురువారం రెండో రోజు ఆడుదాం– ఆంధ్రా క్రీడా పోటీలు హోరాహోరీగా సాగాయి. ఖో–ఖో క్రీడాంశంలో మంత్రాలయం, పత్తికొండ, ఆలూరు మొదటి మూడుస్థానాల్లో నిలిచాయి. బ్యాడ్మింటన్‌లో కర్నూలు, పాణ్యం, ఆదోని, వాలీబాల్‌లో కోడుమూరు, పత్తికొండ, పాణ్యం ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్నాయి. క్రికెట్ పోటీలు ఫైనల్స్‌కు చేరుకున్నాయి. ఫైనల్స్‌లో పాణ్యం, కర్నూలు జట్లు తలపడనున్నాయి.